# చచ్చినవాని పగ

(నిజమైన కథ)

తంగిరాల రాధాకృష్ణయ్యగారు, బి. ఏ., బి. యల్.

నా పేరు వెంకటస్వామి. నేను ఇంజనుడ్రైవరును. ఈనడుమనే మాకంపెనీవారు నన్ను ఎక్స్‌ప్రెస్సు డ్రైవరుగా నియమించినారు. నానిలువ బెజవాడ. ఇప్పుడు నాలుగు వందలు నాజీతం. నేను కంపెనీలో ప్రవేశించునప్పుడు ఫైరుమేనుగా చేరినాను. క్రమేణా నాకు కలిసి వచ్చి మొదటమొదట యార్డు షంటరుగానున్నా, క్రమేణా గూడ్సు డ్రైవరుగానున్నా మెట్టుపైమెట్టు కెక్కుతూవుంటిని. ఇట్లు నాకు పదవులు కల్గుటకు మాకంపెనీలో డ్రైవరుమేటియగు అప్పాజీగారికి నాయందు కలిగిన ప్రేమయే కారణము. తుదకు అతని ప్రేమకు నే నర్హుడను కాకపోయినందుకు నా గుండె లవిసిపోవుచున్నవి...............

మరి అప్పాజీగారు చాలా యోగ్యులు. గంభీరులు. వారి ముఖములోనే ఏదోయొక గొప్పవర్చస్సు వుండేది. కాయపుష్టి గలవారు, కొంచెము వయసు మించినా గూడను. ఆ నెరిసే నెరిసేమీసాలు చాలా అందంగా వుండేవి. ఇంతకూ ఆయనమాటంటే ఎట్లాంటివాడున్నా లక్ష్యపెట్టేట్టుండేది. నేను కంపెనీలో చేరినప్పటినుండియు ఆయన నన్ను దగ్గర తీసి, మంచిసెబ్బరలు చెప్పతూ యథాశక్తి సహాయం చేస్తుండేవాడు. ఇట్లుండగా ఒకనాడు, నేను ఇంకా గూడ్సుడ్రైవరుగానే వున్నాను. అప్పటికి, నన్ను పిల్చి "వెంకటస్వామీ, నేను ఈరోజు వైస్రాయిగారి స్పెషలు నడపుట్కు డిల్లీవరకు వెళ్లవలసి వస్తుంది; నాభార్యనూ, చిట్టినీన్ని యిక్కడే వెయిటింగురూములో ఉన్నారు. వారిని తీసుకెళ్లి కొండపల్లిస్టేషను వద్ద మాక్వార్టర్సులో దిగబెట్టి మరి నీపని చూచుకో" అంటూ మళ్లీ నేను జవాబు చెప్పే లోపలనే నాకు సలాము చేసి వెళ్లిపోయినాడు. నేను వెంటనే వెయిటింగురూములోకి వెళ్లి అప్పాజీగారిభార్యను కలిసి, సంగతి యావత్తూ చెప్పాను. చిట్టికి నాలుగు చాక్లెట్టుగోట్టాలు కొనిపెట్టి, చంద్రాయమ్మను చిట్టిని తీసికొని కొండపల్లిలోకలులో ఒకసెకండుక్లాసులో దిగబడ్డాము. చలిగాలి తీవ్రంగా కొట్టడంచేత కిటికీతలుపులు దించివేసి నేను ఆప్లాటుఫారము మీద కొత్తలను పాతలను కలేస్తూ ఉన్నాను. రైలు కదిలేసమయానికి బండ్లోకి వచ్చాను. చంద్రాయమ్మ కిటికీలోగుండా చూస్తూన్నది. చిట్టి నిద్రపోతూంది. నేను రాగానే చంద్రాయమ్మ "వెంకటస్వామీ, చలిగాలి ఈడ్చి కొడుతూఉన్నది. ఎందుకు వూరికె అటూ ఇటూ తిరగడం? అసలే నీది సుకుమారమైంది దేహం; లోపలికొచ్చి కూర్చోరాదూ!" అంది.

"ఏదో తెలిసినవాండ్లుంటే మాట్లాడుతున్నాను. పైగా యింతమాత్రం గాలికే భయ

పడితే ఎలా అమ్మ మేము!" అని గొణిగాను నేను.

"అలా అనకు: మొన్న ఈనడుమ మావారికి పడిశం పట్టిందని వారంరోజులు పనిలోనికి పోలేకపోయినారు. ముసలాయనకి ఆయని కివి లెక్కా జమా లేదు. వయసువాడివి నీవుగూడా అలా అంటే ఎలా?" అంది చంద్రాయమ్మ, బండి సాగిపోతూండగా.

నాకు ఏదో కలవరం పుట్టింది. ఏదో లే అని ఒక సిగరెట్టు ముట్టించాను. ఆసిన్నక్సులో వాడు మరి నల్లమందే పెట్టాడో, మరేమో కాని, నాకుమాత్రం చాలా చాలా ఆలోచనలు పోయినాయి. నాలుగు పీకులు పీకి, ఆసిగరెట్టువతల పారవేసి, ఆంధ్రపత్రికలో బొమ్మలు చూడ్డం ప్రారంభించాను. చంద్రాయమ్మ "ఆఁ. మావారు, అదేమో లంక చుట్టలు తప్ప తగిలించరు కదా. ముచ్చటకైనా సిగరెట్టు ముట్టించరు." అని ఏదో ఆవలించినట్లు వినబడ్డది. నేనుమాత్రం కిక్కురుమనకుండా పేపరులో బొమ్మలు చూస్తూ, పైకాకితంమీద ఏదో రైల్వే సమ్మెలనుగురించి ఎవరో ఏదో రాస్తే చూద్దామని అనుకోబోతూవున్నాను. "మరి అయితే, పేపరు విశేషా లేవిటి?" అంది చంద్రాయమ్మ. నేనూ ఏదో నాకు తోచింది చెపుతూవుండేటప్పటికి కొండపల్లి స్టేషను వచ్చింది. అక్కడ దిగి క్వార్టర్సుదాకా రిక్షాబండిని మాట్లాడి చంద్రాయమ్మను ఎక్కించాను. చిట్టి ఆవిడ చేతుల్లోనే వుంది. ఆవిడగారు నన్నుకూడా రిక్షాలో ఎక్కవలసిందిగా చాలా బలవంతపెట్టింది. నేనూ కొంచెం మొహమాటపడ్డాను. "అల్లా కాదు. లేకుంటే నేనుకూడా నడిచి వస్తా" ననడం మొదలుపెట్టింది ఆవిడ. సరే నని వెళ్లాము. రాత్రి పొద్దుపోయినా మరలా వంట చేయించింది ఆమె. మే మంతా కలిసి కులాసాగా భోంచేశాం. ఆరాత్రి అక్కడే నిద్రించి వేకువనే మరలా బెజవాడ వచ్చేశాను. ఆవిడగారు నన్ను అప్పుడప్పుడూ వచ్చి చూచిపోతూండ వలిసిందనీ, వాండ్లాయన ఎప్పుడూ అటు ఢిల్లీకో, ఇటు కలకత్తాకో పోవడమున్నూ, ఇంటిసంగతి బొత్తిగా పట్టించుకోడనీ, పిల్లలనీ షికారుకు తీసికెళ్లవలసినా తను వొంటరిగా పోవలసి వస్తుందనీ, దగ్గిరా దాపూ ఎవరూ వుండరనీ, ఆయన ఒకవేళ వచ్చినా ఏ నెలకో రెండునెల్లకో వచ్చి చుట్టంలాగా ఏదో రెండు మెతుకులు కొరికి పోతాడనీ ఏమేమో చాలాదూరం నాతో అంది. నేనూ ఏదో వినినట్లూ విననట్లూ వచ్చేశాను.

అప్పటినుంచీ నేను చంద్రాయమ్మగారి ఇంటికి తరుచుగా వెళ్లుతుండేవాణ్ణి. అప్పాజీ గారు ఉన్నా లేకున్నా కులాసాగానే కాలం గడుపుతూ ఉండేవాండ్లము. కొద్దిరోజుల్లో నన్ను గూడ్సింజను డ్రైవరునుండి ప్యాసెంజరు లోకలు డ్రైవరుగా నియమించారు. కొండపల్లినుంచి కాజీపేటవరకూ నేను లోకలును ప్రొద్దుననే తోలుకొని వెళ్లి మళ్లీ రాత్రి తొమ్మిదిగంటలప్పటికి బెజవాడ చేరుతూంటాను. కొండపల్లి స్టేషనులో ఈ

లోకలు రైల్వేపనివాండ్లకోసం ఒకగంటసేపు ఆగుతుంది. అది తడవుగా నేను ప్రతిదినం షాప్యేటప్పుడు వచ్చేటప్పుడూ కొండపల్లిరాదానే దిగి వెంటనే అప్పాజీగారి యింటిదాకా వెళ్లడం, ఎప్పుడైనా వారు వుంటే శుష్కప్రియాలు కొట్టడం, లేకుంటే చంద్రాయమ్మతోనే ఏదో సర్దాగా మాట్లాడి, పిల్లలతో కాకుంటే కాశేపు ఆ డు కొ ని రావడం మామూలు అయింది. ఇదే మాదిరి అనుదినం జరుగుతూండేది. షరిగా కొండపల్లిస్టేషనుకు ముందు ఒక పెద్ద వంపు వుంది రైలు మార్గంలో. అక్కడే ఆ వంపు మధ్యనే ఈ అప్పాజీగారి ఇల్లున్నూ. బెజవాడ బయలుదేరిందంటే శరపరంపరలుగా కొట్టకరావడం బండిని, కొండపల్లి చిన్న చక్కదాక వచ్చేటప్పటికి, ఈ వంపు దాటడనికి ఊపు తగ్గించడం: ఇల్లా నెమ్మదిగా వస్తూంటే అక్కడ అప్పాజీగారి ఇల్లు; చంద్రాయమ్మ పాలు పోయించుకుంటున్నట్లో, పిల్లల్ని ఆడిస్తున్నట్లో, దాసీదాన్ని దబాయిస్తున్నట్లో, ఏదో ఒకమిష పెట్టికొని వాకిట్లో ప్రత్యక్షంకావడం, నేను కాశేపు ఈ రైలుసంగతి, ఆవిడ కాశేపు ఆ కొంపసంగతి మరచిపోవడం: ఇల్లాంటివి తటస్థిస్తూండేది.

౨

అయ్యా, లోకం; ఎం చెప్ప మన్నారు. ఊళ్లో అందరికీ కండ్లు లేవండీ. కొన్నాళ్లకీ ఊళ్లో అమ్మ లక్కలు ఇదంతా చోద్యంగా చెప్పుకోవడం మొదలు పెట్టారు. వా రన్నారని వీరు. వీ రన్నారని మరొకరు. ఆనోట బడి ఈనోట బడి తుదకు అప్పాజీగారికికూడా అనుమానం తట్టింది. తట్టిందో లేదో—అప్పాజీగారికి నాయందలి అనురాగం మాత్రం పోయింది. కాకుంటే ఏదో నేను పలకరిస్తే పలకడం, మాటకరమాట జవాబు చెప్పడం. చూచీ చూడనట్లు పోవడం. న న్నేదో తొలిగించుకుంటూండడం. నేనుమాత్రం మర్యాదగానే గురుభావంతో వుంటున్నాను. ఇట్లా ఉంటుంటే ఒకనాడు నేను నాఇంజను తుడుస్తూండగా మా యార్డులో, అప్పాజీగారు వచ్చి నాబుజం తట్టి, "ఓయ్" అని నన్ను పలుకరించి నావెంబడి నిలబడ్డాడు. "ఇదిగో, ఇటుచూడు: లోకులు కాకులు; నలుగురు నాలుగు గంటారు. అదేం గాని, నీ కొక్కమాట చెప్పదలచుకొన్నాను. నీవు ఇంకా పదికాలాలు బ్రదికి బాగుండాలంటే ఈలోకలునుంచి మరోబండికి మార్పించుకో. అంతే మాట" అని, నేను మళ్లీ ఎన్నోసంగతులు చెప్పాలని పుట్టెడాశతో వుంటే, ఏమీ వినిపించుకోకుండా పుటిక్కిన వెళ్లిపోయినాడు. మళ్లీ నాకు కనుపడలేదు. నేనో ఆరాత్రియే మాకంపెనీ ఏజంటుగారి వద్దకు వెళ్లి ఏదో నాకు తోచింది మనవి చేసుకొని నాకు మార్పు కలిగేటట్లు చేసుకొన్నాను. నన్ను ఆరోజునుంచి ఎక్స్ప్రెసు ఇంజను డ్రైవరుగా వేసినారు. బెజవాడ వదలితే డోర్నకలు, డోర్నకలు వదలితే కాజీపేట కాజీపేటనుంచి మరల తిరుగు ఎక్స్ప్రెసులో బెజవాడ. లైను కొండపల్లిమీదుగానే. కాని

కొండపల్లిలోమాత్రం ఆగదు. ప్రతిదినం కొండపల్లి వంపుదగ్గరకు వచ్చేటప్పటికి, నేను ఇంజనుకూత వేయించేవాడిని. ఏమో గాని ఆమాయ చంద్రాయమ్మ ఏ కిటికీలోనుంచో, ఏదొడ్డివాకిటినుంచో ఇటు ఇంజనువైపు చూస్తూనేయుండేది. నేను కనుపడగానే ఆముఖంలో ఎక్కడ లేని కళాకాంతులతో కూడిన చిరునవ్వు వెలిశేది. నాకు నిమేషమాత్రం తన్మయత్వం కలిగేది. ఉత్తరక్షణమున ఆవిడ నాకు గాని, ఆవిడకు నేను గాని కనుపడువాండ్లము కాము. వంపు దాటగానే రైలు మేఘాలమీద ఎగిరిపొయ్యేది. తిరుగవచ్చేటప్పుడు రాత్రిపూట ఆమె నాకు ఒకలాందరుతో శలవు ఇస్తూండేది. అయ్యో, ఇట్లా జరిగింది కొన్నాళ్లు కథ. ఆఖరుకు ఒకరోజున నేను ఆవంపుదగ్గరకు వచ్చేటప్పటికి అప్పాజీ యింట్లో ఎవ్వరూ సరమానవులున్నట్లు నాకు కనుపించలేదు. ఏమూ ఏమూ, అని నాకు ఒకతొందర పుట్టింది. ఏమో ఇల్లేమైనా మార్చారేమో అని నాకు నేనే సరిపెట్టుకొన్నాను. మరి మళ్లీ వచ్చేటప్పుడు ఆయింటివైపు చూస్తునుకదా ఆనీషమూ లేదు, శెమ్మూ లేదూ. నేరుగా బెజవాడ వచ్చి కొంచెం కాఫీ పుచ్చుకొని తీరికగా "ఆంధ్ర పత్రిక" మడత విప్పాను, కాశేపు చూచి పోదామని. ఇటు చూస్తును కదా, ఏముందనుకున్నారు, ఆ పై కాగితంమీద:

"ఘోరమైన హత్య

"కొండపల్లిలో ఇంజనుడ్రైవరు భార్యను, పిల్లలను చంపి తన్ను చంపుకొనుట."

## 3

'వెంకటస్వామీ, వెంకటస్వామీ, ఇదేమిటయ్యా యీచిత్రం! లీవరు నీవు పదిహేను మైళ్లకు పెట్టావుకా మరి. చూడూ, ముప్పయికి తిరిగి వుంది ఇప్పుడు.—నమ్ము, నమ్మకపో, అప్పాజీగారు తిప్పతూవుంటే చూచాను నేను' అన్నాడు మాఇంజనులో ఫైరుమేనుగా ఉన్న రామసింగు. నే నింకా ఎక్స్ప్రెస్సు డ్రైవరునే. సరిగా కొండపల్లివంపుమీద రైలు పోతూంది. ఆవంపుమీద గంటకు 15 మైళ్లకు పైవేగమున రైలును నడిపించిన రైలుకు ప్రమాదము కలుగుతుంది. నేను ఎప్పటిలాగనే 15 మైళ్లకు లీవరు తిప్పి ఆస్థలమాహాత్మ్యమును స్మరించుకుంటూ వున్నాను. రామసింగుఘాబరాను చూచి ఇటు తిరుగుదును కదా, లివరు 30 మీద వుంది. రైలో కటకటలాడుతూ సింహగర్జనముతో పరిగిస్తూన్నది. లివరు మరలా 15 కు తిప్పడానికి ప్రయత్నించాను. తిప్పితే తిరగదుగదా! నాశక్తి నంతా పట్టి లాగి లివరును వంపు దాటేవరకు గట్టిగా పట్టుకొన్నాను. 'ఏమిరా ఈగోల' అని రామసింగును అడిగితే, 'అప్పాజీగారు పట్టుకొని 30 మీదికి లాగారండీ, ఇందాక నేను చూచాను' అంటాడు. 'ఎన్నడో చచ్చిన అప్పాజీగా రేమిటి, లివరు తిప్పడ మేమిటి, నీమొఖం నీవు చూడడ మేమిటి రా' అని నే నంటే,—'ఆఁ, నేను చూచానండీ' అంటాడు. మొత్తానికి వాడు చూచాడో లేదో కాని, లివరుమాత్రం ఎంత గట్టిగా తిప్పినా తిరుగలేదు. మరుదినంకూడా యిదే

మాదిరి జరిగింది. మూడోరోజు రామసింగు, నేనూ, ఇద్దరముకూడా కలిసి లివరును పట్టుకో వలసివచ్చింది. తుదకు నాకు వంపువద్దకు వచ్చేటప్పటికి ప్రాణసంకట మయ్యేది. సరిగా కొండపల్లివంపుదగ్గరకు వచ్చేటప్పటికి లివరు 15 నుంచి 30 కి తిరగడం; మేము ఎంత పట్టుకొని లాగినా 15 కు ఒకరాగాన రాకపోవడం; ఎవరో బలవద్విరోధి లివరును 30 మీదికి లాగుతున్నట్లు మాకు అనిపించడం:—ఎట్లాగా రైలును యీ వంపు దాటించడం అని మాకు గుండెల్లో గుండె లేకుండడం—తట స్థిస్తుండేది.

౪

మానిలువ బెజవాడనుండి కాజీపేటకు మార్చవలసివచ్చెను. నేను అందుకు సిద్ధుడనై నాభార్యను పిల్లను కాజీపేటకు తీసుక వెళ్లుతున్నాను. ఇంజను కానుకొని వున్న ఒక చిన్న పెట్టెలో మావాండ్లను ఎక్కించాను. ఆ పెట్టెలో మరెవ్వరూ ఎక్కలేదు. మాఆవిడకు 30 సంవత్సరములు వయస్సు. గొప్పవారి ఇంటిబిడ్డ. సుకుమారి. ఆరోజు ఆవిడయందు నాకెందుకో అంత గౌరవము, అంత ప్రేమ, అంత మమకారమూ కలిగింది. ఇవతల ప్లాటుఫారముమీదనే నేను నిలుచొని, మూడుసార్లు ఆవిడను ఆకిటికీలో గుండా ముద్దుపెట్టుకొన్నాను. అప్పుడు ఆవిడకండ్లల్లో నాకండ్లు కలిసిపోయినాయి. నా కౌగిలిలో నిమేషమాత్రం ఆపె సర్వావస్థలూ మరిచిపోయింది. నాపిల్లను ఎత్తుకొని వెయ్యిముద్దులు కుప్పించి, వదలలేక వదలలేక పిచ్చిపిచ్చిపిచ్చిగా దానితో మాట్లాడుతుండగా, మారైలు బయలుదేరుటకు గంట వినపడ్డాది. ఇంక మురిపెములకు వ్యవధి లేక సరాసరి ఇంజనులోకి వెళ్లి రైలును సాగించాను. తోక ద్రొక్కిన త్రాచువలె విపరీతవేగంతో రైలు వెళ్లిపోయింది.

౫

మరునాటి ఆంధ్రపత్రికలో ఈక్రిందివార్త కానవగును:

"రైలు పట్టాలు తొలగుట

"నిన్నటిదినము బెజవాడనుంచి బయలుదేరిన ఢిల్లీ ఎక్స్ప్రెస్సుబండి కొండపల్లివంపు వద్ద పట్టాలు తొలగినది. ఇంజనుడ్రైవరు హతుడై పోయెను. ఫైరుమేనుకు ప్రమాదకరములగు గాయములు తగిలినవి. ఇంజనుప్రక్కనున్న చిన్నక్యారేజీ ముక్కలు ముక్కలై పోయినది. అందులోనున్న ఒక స్త్రీయున్నూ ఒక బాలికయున్నూ చనిపోయిరి. మిగిలిన ప్రయాణికులకు ప్రమాద మేమియూ కలుగలేదు."